ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం
విశాఖపట్నం కేంద్రం
జాతీయ వార్తలు
తేదీ: 27-09-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు
ముఖ్యాంశాలు

- పర్యాటకం మానవత్వ బంధాలను సృష్టిస్తుందని, ప్రస్తుత తరుణంలో ఇది చాలా అవసరమని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అన్నారు.

- ఆత్మ నిర్భర్ నినాధంతో భారత్ విశ్వ తయారీ కేంద్రంగా మారిందని కేంద్ర కమ్యూనికేషన్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా పేర్కొన్నారు.

- ఆయుష్ ఔషధాలను ప్రజలు సులభంగా పొందేలా మండల స్థాయిలో ప్రత్యేక ఔషధ దుకాణాలను ప్రారంభించాలని యోచిస్తున్నట్టు ఆయుష్ శాఖ మంత్రి ప్రతాపరావు జాదవ్ తెలిపారు.

- ప్రధానమంత్రి తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” కార్యక్రమం ఈ నెల 29వ తేదీన ప్రసారమవుతుంది.

పర్యాటకం మానవత్వ బంధాలను సృష్టిస్తుందని, ప్రస్తుతానికి ఇది చాలా అవసరమని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... శాంతికి పర్యాటకం ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ సంవత్సరం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని "పర్యాటకం మరియు శాంతి అనే ఇతివృత్తంతో జరుపుకోవడం సముచితమని వ్యాఖ్యానించారు. ఈ పర్యాటక దినోత్సవాన్ని ప్రపంచ ఆర్థికాభివృద్ధి, సామాజిక పురోగతి, సాంస్కృతిక మార్పిడిపై పర్యాటకం ప్రభావాన్ని చూపే దినంగా ఉప రాష్ట్రపతి అభివర్ణించారు.
బైట్ - ఉప రాష్ట్రపతి..
(వాయిస్ 31 సెకన్లు)
ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ మాట్లాడుతూ... పర్యాటకం అనేది విభిన్న సంస్కృతులు, దేశాల మధ్య పరస్పర అవగాహనకు వారధి నిర్మించగలదని, ఇది అందరినీ అనుసంధానం చేసే రంగమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉప రాష్ట్రపతి పర్యాటన్ మిత్ర, ఉత్తమ పర్యాటక విలేజ్ పోటీ, ఆతిథ్య పరిశ్రమ భాగస్వామ్యం, తదితర కార్యక్రమాలను ప్రారంభించారు.
=========================
ఆత్మ నిర్భర్ నినాదంతో భారత్ విశ్వ తయారీ కేంద్రంగా మారిందని కేంద్ర కమ్యూనికేషన్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. చెన్నై సమీపంలోని శ్రీపెరంబుదూర్‌లో CISCO అత్యాధునిక తయారీ కేంద్రంలో ఈరోజు ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆధునిక సౌకర్యాలతో కూడిన తయారీ కేంద్రాన్ని భారత్‌లో ప్రారంభించడం దేశం ఎదుగుదలకు నిదర్శనమన్నారు. ఈ కేంద్రం టెలికాం వ్యవస్థలో భారతదేశ సమగ్ర వృద్ధిని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. దేశీయ ఉత్పత్తితో పాటు ఎగుమతులకు సంవత్సరానికి 1.3 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టు మొదటి దశ ఇది. ఈ కేంద్రం అధునాతన టెలికాం టెక్నాలజీని తీసుకురావడంపై దృష్టి సారించనుంది.
=========================
ప్రజల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయుష్ మంత్రి ప్రతాపరావు జాదవ్ అన్నారు. 100 రోజులుగా ఆయుష్ మంత్రిత్వ శాఖ సాధించిన విజయాలను ఈరోజు ఆయన న్యూఢిల్లీలో పత్రికా ప్రతినిధులకు వివరించారు. ప్రపంచ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో ఆయుష్ వ్యవస్థల ఏకీకరణను మెరుగుపరచడానికి మంత్రిత్వ శాఖ, ప్రపంచ ఆరోగ్య సంస్థ ఒప్పందంపై సంతకాలు చేశాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా సాంప్రదాయ వైద్య విధానాలను అభివృద్ధి చేసేందుకు వియత్నాంతో ఔషధ మొక్కలపై అవగాహన ఒప్పందాన్ని, పరిశోధన, జ్ఞాన మార్పిడి, ఆయుర్వేద చికిత్సా విధానాలను రూపొందించడానికి ఆయుర్వేదంపై మలేషియాతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్టు మంత్రి వివరించారు. ఆయుష్ ఔషధాలను ప్రజలు సులభంగా పొందేలా మండల స్థాయిలో ప్రత్యేక ఔషధ దుకాణాలను ప్రారంభించాలని యోచిస్తున్నట్టు చెప్పారు. వృద్ధుల ఆరోగ్య సంరక్షణ అవసరాలను తీర్చేందుకు దేశవ్యాప్తంగా 14 వేల 692 ఆయుష్ క్యాంపులు నిర్వహించినట్లు కేంద్ర మంత్రి ఈ సందర్భంగా తెలియజేశారు.
=========================
ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 114వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. ఈ కార్యక్రమం

ఆకాశవాణి, దూరదర్శన్ నెట్ వర్క్‌లు, AIR న్యూస్ వెబ్ సైట్ ద్వారా న్యూస్ ఆన్ ఎయిర్ మొబైల్ యాప్‌లో ప్రసారం కానుంది. మన్ కీ బాత్ హిందీ ప్రసంగం ప్రసారమైన వెంటనే అన్ని ఆకాశవాణి ప్రాంతీయ భాషల్లో దీని అనువాదం ప్రసారం అవుతుంది.

==========================

విరామం

==========================

పార్లమెంట్‌లో వివిధ విభాగాలకు సంబంధించిన స్థాయి సంఘాలు ఏర్పాటయ్యాయి. BJP పార్లమెంట్ సభ్యుడు భర్తృహరి మహతాబ్ ఆర్థిక వ్యవహారాల ప్యానెల్‌కు, కాంగ్రెస్‌కు చెందిన శశి థరూర్ విదేశీ వ్యవహారాల కమిటీకి, డిఫెన్స్ ప్యానెల్‌కు మాజీ కేంద్ర మంత్రి రాధామోహన్ సింగ్, హోం శాఖ స్టాండింగ్ కమిటీకి బీజేపీ రాజ్యసభ ఎంపీ రాధా మోహన్ దాస్ అగర్వాల్ నేతృత్వం వహించనున్నారు. అలాగే... పెట్రోలియం, సహజ వాయువు కమిటీకి NCP MP సునీల్ తట్కరే, ఎనర్జీ కమిటీకి శివసేనకు చెందిన శ్రీరంగ్ అప్పుబర్నే, వ్యవసాయం, పశుసంవర్ధక, ఆహార ప్రాసెసింగ్ కమిటీకి కాంగ్రెస్ MP చరణ్‌జిత్ సింగ్ చన్నీ నేతృత్వం వహిస్తారు. హౌసింగ్ అండ్ అర్బన్ ఎఫైర్స్ కమిటీకి తెలుగుదేశం పార్టీకి చెందిన మాగుంట శ్రీనివాసులురెడ్డి, రైల్వే కమిటీకి BJP MP CM రమేష్ సారథ్యం వహించనున్నారు.

========================

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రేపు తెలంగాణ రాష్ట్రంలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రపతి హైదరాబాద్ లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా 21వ స్నాతకోత్సవంలో పాల్గొంటారు. సికింద్రాబాద్‌లోని రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళా మహోత్సవ్ 2024ను ఆమె ప్రారంభించనున్నారు. 8 రోజుల పాటు జరిగే ఈ కళా మహోత్సవ్ లో అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర రాష్ట్రాలకు చెందిన కళ, సంస్కృతి, చేతివృత్తులను ప్రదర్శిస్తారు.

===================

రక్షణ రంగంలో నూతన ఆవిష్కరణలకు సాంకేతిక సహకారాన్ని అందించే ప్రయత్నంలో భాగంగా కేంద్ర ఎలక్ట్రానిక్స్, IT మంత్రిత్వ శాఖ, మిలిటరీ కాలేజ్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్ (MCTE) తమ భాగస్వామ్యాన్ని ప్రకటించాయి. ఈ సందర్భంగా కేంద్ర మంత్రిత్వ శాఖ కార్యదర్శి S. కృష్ణన్ మాట్లాడుతూ, స్వదేశీ పరిష్కారాలతో సాయుధ బలగాలకు సాధికారత కల్పించడం చాలా కీలకమని అన్నారు. కృత్రిమ మేధ, క్వాంటం, చిప్ డిజైన్, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ మొదలైన కీలక రంగాలలో సహకార ప్రయత్నాలను బలోపేతం చేయడం ఈ భాగస్వామ్యం ఉద్దేశ్యమని పేర్కొన్నారు. భారత సైన్యం ఎదుర్కొంటున్న సవాళ్లను ఎదుర్కొనడానికి, అవసరాలు తీర్చడానికి ఈ భాగస్వామ్యం సిద్ధంగా ఉందని వివరించారు. ఈ భాగస్వామ్యం భవిష్యత్తులో నూతన రక్షణ ఆవిష్కరణలకు దారితీస్తుందని, యుద్ధ వాతావరణంలోని సవాళ్లను ఎదుర్కొనేందుకు భారత సైన్యాన్ని సన్నద్ధం చేస్తుందని MCTE కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ K.H. గవాస్ విశ్వాసం వ్యక్తం చేశారు.

=====================

రానున్న దసరా, దీపావళి పండుగల సమయంలో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా 5 వేలకు పైగా ప్రత్యేక రైళ్ళను నడపనున్నట్టు రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్ తెలిపారు. పండుగల నేపథ్యంలో రైల్వేపై కలిగే ఒత్తిడిని తగ్గించడమే లక్ష్యంగా ప్రత్యేక రైళ్లను ప్రవేశపెట్టడం జరిగిందని పేర్కొన్నారు. ప్రయాణికుల డిమాండుకు తగినట్టుగా మొత్తం 12 వేల 500 ప్రత్యేక రైళ్లు మంజూరు అయ్యాయని, వాటిలో 5 వేల 975 రైళ్లు 2024 - 25 కాలానికి సంబంధించి ఆమోదించబడ్డాయని వివరించారు. రద్దీని తగ్గించేందుకు 108 సాధారణ రైళ్ళకు అదనపు బోగీలను చేర్చడం జరిగిందన్నారు. రైల్వే చేపట్టిన ఈ చర్యల ద్వారా కోటి మందికి పైగా ప్రయాణికులు ప్రయోజనం పొందుతారని చెప్పారు.

=====================

కోల్‌కత్తాలోని RGకర్ వైద్య కళాశాలలో వ్యర్థాల నిర్వహణకు సంబంధించి అనుసరిస్తున్న విధానాలతో కూడిన నివేదికను అందజేయాలని కేంద్ర దర్యాప్తు సంస్థ, CBI పశ్చిమ బెంగాల్ ఆరోగ్య శాఖను ఆదేశించింది. వైద్య కళాశాల్లో జరిగిన ఆర్థిక అవకతవకలపై జరుపుతున్న విచారణలో భాగంగా పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని వివిధ వైద్య కళాశాలలు, ఆసుపత్రుల్లో బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై వివరాలను సమర్పించాలని కోరింది. బయో మెడికల్ వ్యర్థాల రవాణాకు సంబంధించి, RGకర్ ఆసుపత్రిలో ఆర్థిక కుంభకోణం జరిగినట్టుగా వచ్చిన ఆరోపణల నేపథ్యంలో CBI ఈ చర్యలు తీసుకుంది. బయోమెడికల్ వ్యర్థాలను విక్రయించినట్టుగా ఆరోపణలు CBI దృష్టికి వచ్చాయని, వ్యర్థాల నిర్వాహణ విధానంలో అవకతవకలను CBI అధికారులు గుర్తించారని, అధికార వర్గాలు తెలిపాయి.

=====================

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ "పర్యాటన్ మిత్ర", "పర్యాటన్ దీదీ" పేరుతో ఒక కార్యక్రమాన్ని ప్రారంభించింది. పర్యాటకులకు చక్కని అనుభూతిని కలిగించడం ఈ కార్యక్రమ లక్ష్యం. ఈ కార్యక్రమం కింద పర్యాటక ఉత్పత్తులను అభివృద్ధి చేయడానికి యువతకు శిక్షణ ఇచ్చే అంశంపై దృష్టి సారిస్తున్నట్టు మంత్రిత్వ శాఖ తెలిపింది.

=======================

=======================